క్లుప్తంగా

మూలంకురేశ్వరికి ఖడ్గమాలపూజ

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ కొండపై ఉన్న మూలాంకురేశ్వరి అమ్మవారికి త్రయోదశి శుక్రవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అర్చకులు అయ్యన్నశాస్త్రి అమ్మకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి, దేవీ ఖడ్గమాల కుంకుమపూజలు చేశారు. శ్రీచక్రానికి అష్టోత్తర, సహస్రనామ అర్చనలు చేశారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

త్వరితగతిన గృహనిర్మాణాలు పూర్తిచేయాలి



ఫిరంగిపురం: త్వరితగతిన గృహనిర్మాణ లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోవాలని హౌసింగ్ శాఖ డీఈ సీతారామయ్య అన్నారు. మండల కేంద్రంలోని జగనన్న కాలనీలో నాలుగు లేఅవుట్లను శుక్రవారం పరిశీలించారు. గృహాల నిర్మాణాలు మొదలు పెట్టనివారని పిలిచి వారితో మాట్లాడారు. ఇప్పటి వరకు 69 గృహాలు పూర్తి కాగా మిగిలిన వారు త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. కాలనీలో అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఉన్నారు.

మసీదు ప్రారంభం



మంగళగిరి: అంజుమన్ ఇ హిమాయితుల్ ఇస్లాం సంస్థ ఆధ్వర్యంలో పాత మంగళగిరిలోని మక్కా మసీద్‌ను పునఃనిర్మాణం చేసి ప్రారంభించారు. రూ.కోటితో పునఃనిర్మాణం చేసిన మక్కా మసీదును శుక్రవారం ముస్లిం సంఘాల పెద్దలు ప్రారంభించారు. అంజుమన్ సంస్థతో పాటు పలువురు సభ్యులు, దాతల సహకారంతో నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం సంఘాల పెద్దలు ఎండీ ఇక్బాల్ అహ్మద్, పఠాన్ అలీభాషా ఖాన్, మహ్మద్ రఫీ, పఠాన్ అష్రఫ్ ఖాన్, షేక్ అస్గర్ అలీ, చిన్న తంగెళ్ల, మహబూబ్ జానీ, షేక్ హుస్సేన్, షేక్ అన్వర్, షేక్ నాగుల్ పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య



తాళ్ళాయపాలెం(తాడికొండ): అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందుతోందని ఐసీడీఎస్ ప్రాజెక్టు మందడం సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీలత అన్నారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రామంలో చిన్నారులతో కలసి అవగాహన ర్యాలీని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలలో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించడం ద్వారా వారిలో శారీరకాభివృద్ధి, మానసికాభివృద్ధి, భాషాభివృద్ధిని పెంపొందించవచ్చన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త తనూజ పాల్గొన్నారు.

15 మద్యం బాటిళ్ల పట్టివేత

మంగళగిరి: నగరంలోని తెనాలి రోడ్డు బాప్టిస్టుపేట చర్చి వద్ద 15 మద్యం సీసాలను పట్టణ పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాలు.. తెనాలి వినయ్ అనే యువకుడు మద్యం అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్నాడు. ఈ నేపథ్యంలో పక్కా సమాచారంతో దాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

స్కూల్ గేమ్స్‌లో పాల్గొన్న విద్యార్థినులకు అభినందన



గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ 66వ స్కూల్ గేమ్స్‌లో పాల్గొని ప్రతిభ చూపిన ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినుల్ని ప్రిన్సిపాల్ జి. సునీత అభినందించారు. సాంబశివపేటలోని కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె గ్వాలియర్‌లో గతనెల ఆరో తేదీ నుంచి 12 వరకు జరిగిన హాకీ క్రీడలో పాల్గొన్న సీనియర్ ఇంటర్ విద్యార్థిని ఆర్. అనిత, ఢిల్లీలో జరిగిన బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న సీనియర్ బైపీసీ విద్యార్థిని పీఎస్‌కే హెలెన్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ జి. నరసింహారావు, యూడీసీ కె. ఆదియ్య, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానాలనూ వదలడం లేదు..

- చెట్లను నరికి అమ్ముకుంటున్న వైనం
- ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతున్నారు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన వీఆర్‌ఓ



శ్మశానంలో చెట్లను నరికి కలపను ట్రాక్టర్లకు ఎక్కిస్తున్న దృశ్యం

మంగళగిరి: నగరంలోని శ్మశానాలను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) సహకారంతో రూ.4.50 కోట్లతో అభివృద్ధి చేశారు. పొదలు తొలగించి మౌలిక వసతులు ఏర్పాటు చేసి విద్యుత్, తాగునీరుతో పాటు కర్మల భవనాలను ఏర్పాటు చేశారు. కొందరు టీడీపీ కార్యకర్తలు ఆయన ఆశయానికి తూట్లు పొడుస్తున్నారు. ఇటీవల తాడేపల్లి, మెల్లెంపూడి హిందూ స్మశాన వాటికల్లో జరిగిన చోరీ ఘటనలు మరువక ముందే నవులూరులో మరో ఘటన చోటు చేసుకుంది. శ్మశానాల్లో పెద్ద పెద్ద చెట్లను తొలగించవద్దని ఆదేశించి ఆ చెట్ల చుట్టూ అరుగులు నిర్మించాలని ఎమ్మెల్యే ఆర్కే సూచించారు. అలాగే నవులూరు మక్కేవారిపేటలోని శ్మశాన వాటికలో అధికంగా వేపచెట్లు ఉండటంతో వాటి చుట్టూ అరుగులు కట్టేందుకు వదిలివేశారు. నవులూరుకు చెందిన మట్టుకొయ్య అశోక్‌కుమార్ పాటు ఆయన అనుచరులు పలు ప్రాంతాల నుంచి కూలీలను తీసుకువచ్చి వేపచెట్లను నరికి కలపను తరలించారు. రాత్రి వేళల్లో మిగిలిన చెట్లను నరుకుతుండగా కొందరు స్థానికులు గమనించి శ్మశానంలో చెట్లు నరకడం ఏమిటని ప్రశ్నించడంతో మీకెందుకు అంటూ వాగ్వివాదానికి దిగారు. చెట్లను నరికిన విషయమై స్థానికులు వీఆర్‌ఓకు సమాచారం ఇవ్వగా వీఆర్‌ఓ కిరణ్‌కుమార్ మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి కలపను తరలించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఏపీ కాపు అడ్వకేట్స్ అసోసియేషన్ జాతీయ కోఆర్డినేటర్‌గా డాక్టర్ సూరిబాబు



డాక్టర్ మజ్జి సూరిబాబుకు నియామకపు ఉత్తర్వుల కాపీని అందజేస్తున్న సత్యనారాయణ

మంగళగిరి: ఏపీ కాపు అడ్వకేట్స్ అసోసియేషన్ జాతీయ కోఆర్డినేటర్‌గా డాక్టర్ మజ్జి సూరిబాబు నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం నగరంలోని ఐబీఎన్ భవన్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, డాక్టర్ మజ్జి సూరిబాబుకు నియామకపు పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ ఇంటూరి కోటయ్య, జాయింట్ సెక్రటరీలు కమతం చంద్రశేఖర్, వెలిదండి కోటేశ్వరరావు, అసోసియేషన్ సభ్యులు తలుపుల బాలకృష్ణ పాల్గొన్నారు.

భూ సర్వే పరిశీలించిన ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్లు



సర్వేను పరిశీలిస్తున్న ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్లు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడి గ్రామంలో 2022 ట్రైనింగ్ అసిస్టెంట్ కలెక్టర్లు శుక్రవారం పర్యటించారు. జగనన్న శాశ్వత భూ హక్కు సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆఫ్ లాండ్ సర్వే జాయింట్ డైరెక్టర్ సీహెచ్ పీఎస్ కుమార్, ఏపీ హెచ్‌ఆర్డీ అడ్మిన్ రవీంద్ర మాట్లాడుతూ 2022 బ్యాచ్‌కు సంబంధించిన ఐఏఎస్ ట్రైనింగ్ అసిస్టెంట్ కలెక్టర్లుకు ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వేపై అవగాహన కార్యక్రమాన్ని ప్రాక్టికల్‌గా ట్రైనింగ్ ఇస్తున్నామని చెప్పారు. నాలుగు గంటల పాటు పర్యటన సాగింది. వీరి వెంట దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి ఉన్నారు.

చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆర్కే చేయూత

మంగళగిరి: నగరంలోని పలువురు చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) చేయూతనందించారు. నగరానికి చెందిన తారాజుల రమేష్, అహ్మద్ అలీ, దామర్ల బాబూరావు, చంద్రమ్మలకు వ్యాపారాలకు తోపుడు బండ్లు, ఇస్త్రీ బండ్లు కావాలని కోరగా ఎమ్మెల్యే ఆర్కే స్పందించి వాటిని సొంత నిధులతో తయారు చేయించి అందజేశారు. నగరంలోని ఆటోనగర్‌లోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం వద్ద చిరు వ్యాపారులకు మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, నాయకులు సంకె సునీత, మల్లవరపు సుధారాణి, బొమ్ము శివరామిరెడ్డి, ఆకురాతి రాజేష్, మహ్మద్ ఫిరోజ్‌ల చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు.

తోపుడుబండ్లు అందజేత

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని ఈమని గ్రామంలో అద్దెబండ్లపై చిరువ్యాపారం చేసుకునే వారికి ఎమ్మెల్యే ఆర్కే సహకారంతో శుక్రవారం తోపుడు బండ్లను అందజేశారు. కార్యక్రమంలో దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి అందజేశారు. దుగ్గిరాల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన యర్రమోతు సాయికుమార్ కుటుంబానికి 15 వేల రూపాయలు అందించారు. కార్యక్రమంలో ఈమని సొసైటీ ప్రెసిడెంట్ నలకుర్తి యేసుబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి ధర్మరత్నం, మక్కె ఆనంద్, జమ్ముల లోకేష్, ఉయ్యూరు మాధవి పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి కుటుంబానికి సాయం

మంగళగిరి: నగరంలోని టిడ్కో ఇళ్లలో నివాసం ఉంటున్న జొన్నాదుల నాగేశ్వరరావు కుటుంబానికి ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం నాగేశ్వరరావు సతీమణి వెంకటరమణమ్మ మృతి చెందగా ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించి సహాయాన్ని అందజేశారు.

తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా ప్రసూనారెడ్డి

తెనాలి: తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా ప్రసూనారెడ్డి బాధ్యతల్లోకి వచ్చారు. ఆయన స్వస్థలం రాజమహేంద్రవరం. ప్రస్తుతం తమిళనాడు సర్కిల్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, భారత ప్రభుత్వ ఆధ్వర్యంలోని తపాలశాఖ ప్రజలకు అనేక రకాలైన పథకాలను అందిస్తోందని, వాటిని మారుమూల ప్రజానీకానికి సైతం చేరువ చేయాలన్నదే తన లక్ష్యంగా చెప్పారు. ప్రముఖులకు తక్కువ ఖర్చుతో జన్మదిన శుభాకాంక్షలు తెలుపుకునేందుకు వీలుగా 'ఈ-పోస్ట్...సర్వీసు అమలులో ఉందన్నారు. ఈనెల 20వ తేదీన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమెకు కేవలం రూ.10లతో ఈ-పోస్ట్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయవచ్చని చెప్పారు. తెనాలి డివిజనులోని ప్రతి పోస్టాఫీసులోనూ ఈ సౌకర్యం ఉందని, అభిమానులు, ఆసక్తి గలవారు వినియోగించుకోవచ్చని ఆయన సూచించారు. తపాల జీవితబీమా/ గ్రామీణ తపాల జీవితబీమా పాలసీలను కొందరు రెన్యూవల్ చేయడం లేదన్న భావనతో పునరుద్ధరణకు తపాలశాఖ అవకాశం కల్పించిందని చెప్పారు. ఈనెల ఒకటో తేదీనుంచి జులై 31వ తేదీవరకు ఈ సౌలభ్యం అందుబాటులో ఉంటుందని, పునరుద్ధరణకు చెల్లించాల్సిన డిఫాల్ట్ ఫీజులో రూ.లక్ష నుండి రూ.3 లక్షల వరకు 25 శాతం అంటే రూ.3000 వరకు, రూ.3 లక్షలు ఆపైన 30 శాతం రాయితీ అంటే రూ.3500 వరకు తగ్గింపు ఉంటుందని వివరించారు.

సాంకేతిక విద్యనందించడమే లక్ష్యం

కేఈఎస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మజావాణి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేఈఎస్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మజావాణి

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని ప్రాంతాల నుంచి వచ్చే బాలికలకు సాంకేతిక విద్యనందించమే కేఈఎస్ పాలిటెక్నిక్ కళాశాల లక్ష్యమని ఆ కళాశాల ప్రిన్సిపాల్ కె.పద్మజావాణి అన్నారు. శుక్రవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. పద్మజావాణి మాట్లాడుతూ తమ కళాశాలలో చదివిన విద్యార్థులు దేశ విదేశాలలో మంచి ఉద్యోగాల్లో స్థిరపడ్డారని చెప్పారు. క్రమశిక్షణ, మెరుగైన విద్యను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. కోస్తా జిల్లాలో మొట్టమొదటగా స్థాపించిన ఉమెన్స్ కళాశాల కేఈఎస్ పాలిటెక్నిక్ కళాశాల అని, గతంలో విజయవాడ పీడబ్ల్యూడీ గ్రౌండ్ మైదానంలో ఉన్న కళాశాలను వడ్డేశ్వరానికి మార్పు చేసినట్లు వివరించారు. అంతేకాకుండా ఇక్కడ ఉన్న విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి పాలిటెక్నిక్ చదవాల్సి వస్తోందని, దీనిని దృష్టిలో ఉంచుకుని ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి వడ్డేశ్వరంలో విద్యార్థులకు ఈ కళాశాల ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కళాశాలను ఇప్పుడు కో ఎడ్యుకేషన్ నిర్వహించేందుకు స్టేట్ టెక్నికల్ బోర్డు నుంచి అనుమతులు వచ్చాయని ఈ ఏడాది నుంచి కో ఎడ్యుకేషన్ తరగతులు ప్రారంభిస్తున్నామని చెప్పారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ 40 ఏళ్ల క్రితం బాలికలకు ఒక ప్రత్యేకమైన కళాశాల ఉండాలనే ఉద్దేశంతో ఒక సంస్థను స్థాపించి కేఈఎస్ పాలిటెక్నిక్ కళాశాలను స్థాపించామని తెలిపారు. సీఎస్ఈ, ఈసీఈ కోర్సులు తమ కళాశాలలో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ కె.రాజ్యలక్ష్మి, కళాశాల అకౌంటెంట్ పి. చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

సీజీజీబీకి మరో పురస్కారం



పీఎఫ్‌ఆర్‌డీఏ చైర్మన్ దీపక్ మొహంతి నుంచి అవార్డు అందుకుంటున్న సీజీజీబీ చైర్మన్ కామేశ్వరరావు

కొరిటిపాడు(గుంటూరు): చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్(సీజీజీబీ) అటల్ పెన్షన్ యోజన పథకం కింద 2022-23 ఆర్థిక సంవత్సరానికి పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌ఆర్‌డీఏ) నుంచి మరో అవార్డును అందుకుంది. బ్యాంకుల ప్రయత్నాలను ప్రోత్సహించడానికి, ఉత్తేజపరచడానికి, పీఎఫ్‌ఆర్‌డీఏ వరుస ఏపీవై బిగ్ క్యాంపెయిన్‌లను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను ఏపీవై బిగ్ బిలీవర్స్ అనే ప్రధాన క్యాంపెయిన్‌ను ఈ సంవత్సరం 15 ఫిబ్రవరి నుంచి 31 మార్చి 2023 వరకు నిర్వహించారు. సీజీజీ బ్యాంక్ ప్రారంభం నుంచి చురుకుగా పాల్గొని పీఎఫ్‌ఆర్‌డీఏ నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించింది. క్యాంపెయిన్‌లో విజేతల్ని గుర్తించి బహుమతులు ఇవ్వడానికి పీఎఫ్‌ఆర్‌డీఏ శుక్రవారం (16వ తేదీ) చెన్నైలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనికి చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ టి.కామేశ్వరరావు హాజరయ్యారు. పీఎఫ్‌ఆర్‌డీఏ చైర్మన్ దీపక్ మొహంతి నుంచి ఏపీవై బిగ్ బిలీవర్స్ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ బ్యాంక్ ఉద్యోగులు, బిజినెస్ కరస్పాండెంట్ల నిరంతర కృషి వల్లే అవార్డును గెలుచుకున్నట్లు చెప్పారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

సిబ్బందికి ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ సూచన



వైద్యులు, పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ సిబ్బందికి సూచించారు. పోలీస్ సంక్షేమ దివస్ సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని పోలీస్ యూనిట్ ఆసుపత్రిలో అన్ని పోలీస్‌స్టేషన్ల పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు కాటూరి అర్బన్ వైద్య సిబ్బంది ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంమే మహా భాగ్యమని తెలిపారు. అనంతరం వైద్య సిబ్బంది వైద్యసేవలు, నిర్ధారణ పరీక్షలు చేపట్టారు. ఆరోగ్యంగా ఉండేందుకు సూచనలు, సలహాలు అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ కె.కోటేశ్వరరావు, డీఎస్పీ చంద్రశేఖర రావు, ఆర్‌ఐలు థామస్‌రెడ్డి, రాఘవయ్య, ప్రేమ్‌కుమార్, ఆర్ఎస్ఐలు, కాటూరి అర్బన్ వైద్యులు శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వరరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, ఫర్నీ, సిబ్బంది పాల్గొన్నారు.

బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం నేరం



నెహ్రూనగర్: బాల కార్మికుల్ని పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని 21వ డివిజన్ కార్పొరేటర్ కాంద్రకుంట గురవయ్య తెలిపారు. చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొండ వెంకటప్పయ్య కాలనీలో కేఎస్ఆర్‌టీ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూలులో శుక్రవారం బాల కార్మిక వ్యతిరేక మాసం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలందరిని బడికి వెళ్లే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శైలజ, ఫౌండేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ జి. వెంకయ్య, స్కూల్ హెచ్‌ఎం రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రత్నాల చెరువు రోడ్లు పూర్తి

ఎమ్మెల్యే ఆర్కే చొరవతో నిర్మాణం



రత్నాలచెరువులో పూర్తయిన గ్రావెల్ రోడ్డు

మంగళగిరి: నగరంలోనే రత్నాలచెరువు 3.50 కోట్లతో ప్రధాన రహదారులను తారు రోడ్డులుగా అభివృద్ధి చేశారు. అంతర్గత రోడ్లను గ్రావెల్ రోడ్లు వేశారు. ఇటీవల రత్నాలచెరువు లోపల సూర్యనారాయణ నగర్, శ్రామిక నగర్‌లో నివాసముంటున్న వారు ఎమ్మెల్యే ఆర్కే, వాట్సప్ మెసేజ్ ద్వారా తమ రోడ్ల పరిస్థితిని వివరించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే ఆయా ప్రాంతాలను సందర్శించి వెంటనే రోడ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. రోడ్ల నిర్మాణ పనులు చేపట్టిన అధికారులు ఐదు రోజులలోనే రూ. 25 లక్షలతో రెండు రోడ్లను గ్రావెల్ రోడ్లుగా అభివృద్ధి పరచడంతో ఆ ప్రాంత వాసులు ఎమ్మెల్యే ఆర్కేకు కతజ్ఞతలు తెలిపారు. నగర పరిధిలోని యర్రబాలెం బసవతారకనగర్‌లో రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. ఇటీవల ఎమ్మెల్యే ఆర్కే పర్యటించిన సమయంలో రోడ్డు గోతులుగా మారడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆయన దష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఆర్కే రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. రోడ్డు నిర్మాణ పనులను వారం రోజులలో పూర్తి చేశారు.

30న రైతు ధర్నాను జయప్రదం చేయండి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

తాడేపల్లిరూరల్: రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న రైతాంగ సమస్యలు పరిష్కారం చేయాలంటూ జూన్ 30న విజయవాడ ధర్నాచౌక్‌లో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండ జాతీయ రహదారి వద్ద కార్యాలయంలో ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా విస్తృతస్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకర్ అధ్యక్షత వహించారు. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం నవంబర్, డిసెంబర్ నెలల్లో అధికంగా వర్షాలు పడడం, 2023 ఏప్రిల్, మే నెలలో అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతిని రైతాంగం పూర్తిగా నష్టపోయారని అన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతాంగానికి సేవలు అందిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం పండించిన ధాన్యాన్ని రైతుల వద్ద నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేయలేదని విమర్శించారు. బీజేపీ అనుసరిస్తున్న విధానాల వలన రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని అన్నారు. రాష్ట్రంలో రైతాంగం ఎందురొకంటున్న పలు సమస్యలపై జూన్ 30వ తేదీన విజయవాడలో జరిగే మహాధర్నాకు పెద్ద ఎత్తున రైతాంగం హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతున్నామని చెప్పారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో లక్షల ఎకరాలలో పత్తి, మిర్చి, మొక్కజొన్న, పొగాకు వంటి పంటలు తీవ్రంగా నష్టపోయాయని అన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు, ఎత్తిపోతల పథకాలకు అవసరమైన నిధులు కేటాయించి త్వరిత గతిన పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు, గుంటూరు జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్‌కుమార్, సంఘం జిల్లా నాయకులు మోదుగుల శ్రీనివాసరెడ్డి, వెంకట శివ, టి.బక్కిరెడ్డి, ఎస్.కె.ఎర్రఫీరు, పూర్ణయ్య, బ్రహ్మేశ్వరరావు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన కల్పించాలి

జోనల్ మలేరియా అధికారి డాక్టర్ వినోద్‌కుమార్



ర్యాలీలో పాల్గొన్న జోనల్ మలేరియా అధికారి డాక్టర్ వినోద్‌కుమార్

మంగళగిరి: మలేరియా నివారణపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. నగరంలో జరుగుతున్న మలేరియా మాసోత్సవాల్లో ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. 11వ సచివాలయం కొప్పురావుకాలనీలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్యకేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు దోమల పెంపునకు అనువుగా ఉండే నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. ఇంటి లోపల ఫ్రిజ్‌లు, వాటర్ కూలర్లు, పూలకుండీల్లో నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకోవాలన్నారు. జ్వరం లక్షణం కనిపించిన వెంటనే నిర్లక్ష్యం లేకుండా దగ్గరలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రక్త పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సత్యవతి, మంగరాజు, సూపర్ వైజర్లు సాగర్, సైదులు, జయలక్ష్మి, వాసు, మూర్తి పాల్గొన్నారు.

గృహ కార్మికుల సంక్షేమానికి కృషి

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కత్తెర హెనీ క్రిస్టినా, సురేష్‌కుమార్, మద్దాళి గిరిధర్, పాల్ ట్రీసా, తెకేనాత్, వ్యాకుల మేరి

గుంటూరు ఎడ్యుకేషన్: గృహ కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. మల్లికార్జునపేటలోని సెయింట్ ఆన్స్ మనో వికాస కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గృహ కార్మికుల సమాఖ్య ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హెనీ క్రిస్టినా మాట్లాడుతూ గృహ కార్మికులుగా పని చేస్తున్న మహిళలు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాల్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలతో అర్హులైన మహిళలందరికీ లబ్ధి చేకూరుతోందని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ సమాజంలో అన్ని రకాల వృత్తులవారు గౌరవ ప్రదంగా జీవించాలనేది ప్రభుత్వ ముఖ్యోద్దేశమని, దానికి అనుగుణంగా గృహ కార్మికులకు శ్రమకు తగిన వేతనాలు, పెన్షన్ వంటి సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని చెప్పారు. గృహ కార్మికుల న్యాయమైన సమస్యల్ని పరిష్కరించి, హక్కుల సాధనకు సహకారాన్ని అందిస్తామని తెలిపారు. మోంట్‌ఫోర్ట్ సోషల్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ వర్గీస్ తెకనేత్ మాట్లాడుతూ గృహ కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టం తీసుకురావాలని కోరారు. గృహ కార్మికుల హక్కుల్ని పరిరక్షించడంతో పాటు హింస, వివక్షతకు వ్యతిరేకంగా వారిని కాపాడేందుకు సమగ్ర రక్షణ చట్టం అవసరమని తెలిపారు. గృహ కార్మికుల్ని ఈఎస్ఈ, పీఎఫ్‌లో చేర్చి, ప్రభుత్వం ఇళ్లను నిర్మించి ఇవ్వాలని కోరారు. సదస్సులో వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ కత్తెర సురేష్‌కుమార్, గుంటూరు ప్రావిన్షియల్ సుపీరియర్ సిస్టర్ పాల్‌ట్రీసా, మైనార్టీ సంక్షేమశాఖ సలహాదారు డాక్టర్ మద్దు బాలస్వామి, సీఎస్ఎస్‌ఏ జనరల్ కౌన్సిలేటర్ సిస్టర్ రీనా జోస్, గృహ కార్మికుల సమాఖ్య కార్యదర్శి సిస్టర్ వ్యాకుల మేరి, సమాఖ్య ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

19 నుంచి శ్రీదత్తసాయి మందిర వార్షిక ఉత్సవాలు

ఈమని(తెనాలి): దుగ్గిరాల మండల గ్రామం ఈమనిలోని శ్రీదత్తసాయి ప్రేమమందిరం 17వ వార్షిక ప్రతిష్ట వార్షికోత్సవాలు ఈనెల 19 నుంచి 21వ తేదీవరకు వైభవంగా జరగనున్నాయి. ఇందులో భాగంగా తొలిరోజైన 19వ తేదీన సంప్రదాయ భజనలు నిర్విస్తారు. 20వ తేదీన శ్రీసాయి సచ్చరిత్ర పారాయణం ఉంటుంది. చివరిరోజైన 21న శ్రీసాయిబాబాకు విశేష అభిషేకాలు, శ్రీసాయి మంత్ర జప తర్పణ హోమాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1.30 గంటల్నుంచి అన్న ప్రసాద వినియోగం ఉంటాయి. అదేరోజు రత్రి 8.30 గంటలకు సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. శ్రీమహానందీశ్వర నాట్యమండలి, తెనాలి వారిచే 'పాండవోద్యోగం' నుండి పాన్పు సీను, 'శ్రీరామాంజనేయ యుద్ధం' ప్రదర్శిస్తారని వివరించారు. శ్రీదత్తసాయి ప్రేమమందిరం, శ్రీఅన్నపూర్ణ ఉచిత హోమియో వైద్యసేవా కేంద్రం, శ్రీకొఅపాటి అన్నపూర్ణమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో ఈ వేడుకలు జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు.